# వ్యవస్థ

## శ్రీ మధురాంతకం రాజారాం

అప్పుడే ప్రొద్దు క్రుంకింది. చలికాలపు సాయంకాలమేమో సందె చీకట్లు గుబుర్న ముసురుకుంటున్నాయి. వారం రోజులనుంచీ రోజు కొకటి రెండుతడవలుగావచ్చి పరామర్శించిపోతున్న వానజల్లుల మూలంగా వాతావరణం తడిగావుంది. శరీరానికి యింపితంగాలేని చల్లటిగాలి విసురుగా పోరాడుతోంది. ఏ విధంగా చూచినా వాహ్యాళి వెడలడానికి అది అనువైన సమయంకాదు. కానీ అది కొత్తవూరు. ఆ వూళ్ళో వుండదలచుకున్నది ఒకటిరెండు రోజులుమాత్రం. మళ్ళీ జీవితకాలంలో అక్కడికి రావడం కుదురుతుందో కుదరదో తెలియదు. ఎక్కడికివెళ్ళినా అవకాశమున్నంతలో అక్కడివిశేషాలను గురించి తెలుసుకోవాలన్నది మానవుడి వ్యాపకాలను ఎక్కువజేస్తున్న జిజ్ఞాసలో ఒకటి!

ఏనా ఆ వూళ్ళో విశేషాలేమున్నాయి? వూరిశివార్లలో జీర్ణ దేవాలయాలున్నాయి. వూళ్ళో మురికినీటి కాలువ లున్నాయి. పరుగిడుతున్న జెర్రిపోతుల్లా మెలికలు తిరిగిపోతున్న వీధులున్నాయి. నేలమాళిగల్లాంటి పెంకుటిళ్ళు. ఏ లారీయో వీధంటవెళ్తే హుమ్మని పైకిలేచే ఎర్రటిదుమ్ము. అవారసముద్రంలో తేలియాడుతున్న ద్వీపంకాదుగానీ ఆ వూళ్ళో ఏ చేదబావి నీరుత్రాగిచూచినా ఆ వూహ నిజమే కావచ్చుననిపిస్తుంది. అన్నింటికన్నా విచిత్రం ఆ వూళ్ళో అదొక రకపు ముళ్ళచెట్లు వినా మరొక భూమీజం మొలవదు. అథవా మొలిచినా ఆ చవిటి పర్రలో అదిపెరిగి పెద్దదయ్యే ప్రమాదానికి అవకాశాలేవు. కంచెల్లోనూ అదే, కాలువగట్లునా అదే! ఇంటి పెరళ్ళలోనూ అదే, మంటి దిబ్బల్లోనూ అదే! చెట్టులేని దేశంలో ఆముదపుచెట్టే మహావృక్ష మంటారు. ఆ సామెతను యించుక సవరించుకుంటే, ఆ వూరివారి పాలిటికి ఆ ముళ్ళచెట్టే మందార తరువు!

పైన ఉదహరించిన విశేషలమాటకేంగానీ ఆ వూళ్ళో కొట్టవచ్చినట్టుగా భాసించే విడ్డూరంఒకటి కనిపిస్తుంది మనుషులు! సందుల్లో గొందులో రచ్చల్లో రాజవీధుల్లో క్రిక్కిరిసిన మనుషులు! ఉన్న అసౌకర్యాల కన్నింటికీ తట్టుకుని యిందరు మనుషులక్కడ కాలం వెళ్ళదీస్తున్నందుకు కారణమేమిటో విచారించగా తెలిసింది. ఆ వూరు గొప్పవ్యాపారకేంద్రమట! వ్యాపారానికి తోడుగా యిటీవల ఆ ప్రాంతంలో గనులు కొన్ని బయట పడ్డాయట! ఈ ఉదంతం తెలియగానే బెల్లానికి చీమల్లా, కొల్లేటికి కొంగల్లా జనం గుంపులుగుంపులుగా తరలి వచ్చేశారట!

"గనులమూలంగా మా వూరికేం శోభవచ్చి పడిందనుకున్నారు బావగారూ! ఎవరినైతే చూడాలని ఆ వూళ్ళో దిగానో ఆ దూరపు బంధువుమాటల సందర్భంలో చెప్పినసంగతి. "అద్దెరేట్లు పెరిగిపోయాయి. ఆరు మాసాల్లో నేనొక పాకవేయబోతున్నానని చెబితే దానికిప్పుడే అడ్వాన్సు యిడుతుంది. మునుపీ వూళ్ళో బిక్కుబిక్కుమంటూ ఓ సినిమా టెంటువుండేది. ఇప్పుడుదానితో బాటుగా రెండు పక్కాథియేటర్లున్నాయి. కొత్తచిత్రం విడుదలైనరోజున టిక్కెట్టు దొరకదు. అగ్గిపెట్టె కావలసివస్తే యింతకుమునుపు బజారుదాకా వెళ్ళవలసివచ్చేది. ఇప్పుడు వీధివీధికీ ఓ బంకు వెలసింది. అంతేకాదండోయ్! ఇప్పుడు మా వూళ్ళో రిక్షాలుగూడా వున్నాయి......"

ఊరి పెరుగుదల ఆ గృహస్థుడికి హర్షదాయకం కావడంలో ఆశ్చర్యమేమీ లేదు. మీదుమిక్కిలి ఆయన వూళ్ళో ఐదారు స్వంతయిళ్ళున్నాయి. సినిమా థియేటరులో వాటాగూడావుంది. ఆ వూళ్ళో ఎందరు మనుషులుంటే ఆయన కంత ఆనందం. కానీ పొరబాటునో గ్రహపాటునో ఆ వూరికివచ్చి ఒకటి రెండు రోజుల్లో వెళ్ళిపోనున్న మానవుడికి అదేమంత ఆనందదాయకం కాకపోవడంగూడా సహజమే! కానైతే లభ్యమైన విషయ పరిజ్ఞానంమాత్రం బాటసారి తన భుజానికి తగిలించుకున్న చద్దన్నం మూటలా ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా ఆదుకుంటుందన్నది పెద్దల అనుభవం. అందుకు తార్కాణగా ఊరి చివరికొనదాకా వీధుల్లో గస్తీతిరిగి చివరకు రాత్రి ఎనిమిదిగంటలప్పుడు యింటికి దారి తెలియక ఒకానొక శృంగాటకంలో నిలిచిపోయిన నాకు ఆ ఊళ్ళో రిక్షాలున్నాయన్న విషయం తవాలున స్ఫురణకు వచ్చింది.

కానీ ఒక సందేహం. సాయంత్రం అయిదుగంటలనుంచీ జరుగుతున్న పురవిహారంలో మచ్చుకైనా కనిపించని రిక్షాబండి యిప్పుడు నా అవసరాన్ని గుర్తించగలదన్న నమ్మకమేమిటి? నమ్మకమైతే లేదుగానీ అదృష్టమంటూ ఒకటి లేకపోలేదు. ఈ ప్రపంచంలో కాకతాళీయంగా ఎలాంటి విచిత్ర సంఘటనలైనా జరిగే అవకాశాలున్నాయి. అదృష్టమో, కాకతాళీయమో, ఎలాగైతే నేమి పది పదిహేను నిమిషాలకల్లా ఓ రిక్షా ప్రత్యక్షమైంది.

ఒక్క చూపులుచూస్తూ దిగాలుపడివున్న నాంకాస్త చప్పున పసిగట్టేసినట్టున్నాడు రిక్షావాడు— "కూర్చోండిబాబూ! ఎక్కడికి వెళ్ళాలి మీరు?" అంటూ దగరికి వచ్చేశాడు.

గమ్యస్థానం చెప్పాను.

"పాతచావడివీధా! ఎక్కడుందది?" కళ్ళు చిన్నవిచేసి నొసలు చిట్లిస్తూ అతడు ప్రశ్నించాడు.

అతడలా ప్రశ్నించిన క్షణంలో నేను ఉలికిపడ్డాను. ఈ కంఠస్వరాన్ని ఎక్కడో విన్నట్టుంది! ఇతగాణ్ణి ఎక్కడో చూచినట్టు గుర్తు! మబ్బులగముల్లో చిలిపితనాలు ఒలకబోసే మెరపుతునకలాంటి పూర్వ స్మృతి అది. ఆ స్మృతిని అందిపుచ్చుకోవాలన్న గట్టి ప్రయత్నంలో ప్రశ్నకు బదులుచెప్పుకోవాలన్న విషయంగూడా జ్ఞప్తికి వచ్చిందిగాదు.

"ఎలా వెళ్ళాలో తెలియదా మీకు?" అతడే మళ్ళీ ప్రశ్నించాడు.

"అరవయ్యేళ్ళొచ్చినా నడిచి వెళ్ళగలిగేపాటి ఓపిక లేకపోలేదు. ఏ వైపుగా వెళ్ళాలన్నదే సమస్య" అన్నాను.

"ఏం చేద్దాం మరి! పోనీ కూచోండి. ఎవరినైనా అడిగితే అదే తెలుస్తుంది."

కూర్చున్నాను. మూడు చక్రాలబండి పరుగు లంకించుకుంది.

వెనుకవైపునుంచీ ఎంతసేపుచూచినా అతణ్ణి పోల్చుకోవడం దుస్తరం. ఉన్నదొకటే గత్యంతరం. "అలాగైతే నువ్వూ నాలాగే ఈ వూరికి క్రొత్తగా వచ్చావన్నమాట! అన్నట్టు ఈ వూళ్ళో ఎన్నిరిక్షా లున్నాయబ్బీ?" అంటూ సంభాషణకు ఉపక్రమించాను.

"ఎన్నో ఎక్కడివి! ముచ్చటగా ఓ అరడజను బళ్ళున్నాయి. అవైనా సెకండ్‌హాండు, థర్డ్‌హాండు బళ్ళు! ఓ ఆసామీ తీసుకొచ్చి ఈ వూళ్ళో పారేశాడు. మీరు మాకు కిరాయి డబ్బులిస్తే మేమాయనకు అద్దె చెల్లించుకుంటాము." చటాలున వెనుదిరిగి అడిగాడతడు—"మిగిలేదేమిటని అడగరే?"

నిజం చెప్పొద్దూ, నాకా వివరాలన్నీ తెలుసుకోవాలని లేదు. ఇతగాడు ఏ వూరినుంచి ఇక్కడికి వచ్చాడు ? ఎక్కడ, ఏ సందర్భంలో ఇతణ్ణి చూడ్డం తటస్థించి వుంటుంది ? ఇతణ్ణి పోల్చుకోవాలన్న కుతూహలం నాలో క్షణక్షణానికీ ఉద్ధృతమవుతున్న దెందుకు ? ఎలా పోల్చుకోవడం యితణ్ణి ?

కాలం గడిచి పోతోంది.

రిక్షా పరుగిడుతోంది.

ఎంత లేదన్నా అతనికి యాభై యేళ్ళుండకపోవు. పొట్టి క్రాపింగు. మామూలుగా సాహేబులు వాడుక చేసే లుంగీని చుట్టుకున్నాడు. కాకీచొక్కా తొడుక్కున్నాడు. నిండామునిగిన తర్వాత చలిబాధకు వెరవని వైఖరిలాగా అతడి ముఖంలో ఏదో కర్కశత్వంవుంది. పూసలవెంట దారంలాగా అతడి మాటల్లో పెళుసుతనంవుంది. కారణమేమిటో సరిగ్గా చెప్పలేనుగానీ అత డీ రకపు జీవితానికి అలవాటు పడినవాడులా లేదు. ఇతడు బ్రతికిచెడినవాడా ? లేక చెడిపోయి యిలా బ్రతుకుతున్నాడా ?

ఆఖరు కొక నిర్ణయానికి వచ్చేశాను. ఈ ముసుగులో గుద్దులాటకు స్వస్తిచెప్పి అబ్బీ ! నీ పేరేమిటి ? ఎక్కడినుంచీ యిక్కడికి నీ రాక ? అని మాటిగా అడిగేస్తే !

అడగవచ్చు! కాని అతడు సజావుగా సమాధానం చెబుతాడో చెప్పడో... ఒకవేళ చెప్పకపోయినా నాకుపెద్దగా నష్టమయ్యే దేముంది ?

ప్రశ్న నాలుక చివరిదాకా వచ్చేసరికి రిక్షా ఆగిపోయింది. ఒకనిముషం తాళుకోమని చెప్పి రిక్షావాడు వీధికొకవారగావున్న చెక్కల కొట్టును సమీపించాడు.

ఆ కొట్టు చాలాచిన్నది. అందులోవున్న వస్తువులు మరీతక్కువ సగానికి పైగా ఖాళీగానేవుందది. బుడ్డీదీపపు గుడ్డివెలుగులో కునికిపాట్లు పడుతున్న ఆ కొట్టు ఆసామికిగూడా యాభై యేళ్ళుంటాయి. బురదనీటిలో ప్రతిబింబంలా వున్న అతడిముఖం రిక్షావాలా కనిపించగానే వికసించింది.

"నీ పనే హాయిగావుందిరా బాబూ ! చూస్తున్నానుగా ! ఉదయంనుంచీ బేరాలు తగులుతూనే వున్నాయి నీకు ! నాదేముంది ? సాయంకాలం మూడు గంటలకనగా ఓ శాస్త్రీవచ్చి ఓ అరపెట్టెడు సిగరెట్లు పట్టుకెళ్ళాడు. అప్పటి నుంచీ ఓ నయాపైసా చేతిలో పడివుంటే ఒట్టు ! మంచోచెడో ఓ పడవలో ప్రయాణంచేస్తూ వచ్చాం యిందాకా ! నడిమంతరపు సిరిలాంటి దేదైనా తగులుకుంటే జతగాణ్ణి మరచిపోవద్దు......"

కొట్టు ఆసామి యింకా మాట్లాడుతూనే వున్నాడు. రిక్షావాలా ఓ కట్ట బీడీలు కొనుక్కుని తిరిగివచ్చి తన ఆసనంపైన అధివసించాడు. చిత్రమేమిటంటే ఎలా వెళ్ళాలో వాకబుచేసి తెలుసుకోకపోయినా రిక్షా గురిపెట్టిన బాణంలా గమ్యస్థానం చేరుకోగలిగింది. రిక్షావాడికి తానాశించినంతకన్నా కాస్త ఎక్కువగానే ప్రతిఫలం ముట్టడంవల్ల యింటి గుమ్మందగ్గర బేరాలాడుతూ నిల్చోవలసిన యిబ్బందిగూడా తప్పింది. భోజనాలవేళ మీరిపోతోందేమో, యింటిల్లపాదీ అతిథిసత్తముడి రాకకోసం కాచుకుని కూచున్నారు. తొమ్మిదింటికలా భోజనాలు పూర్తికావచ్చాయి. ఏ కరువుపెడుతున్న ఈ కార్యకలాపాలన్నీ యాంత్రికంగా జరిగిపోతున్నాయి. మనసుమాత్రం గత జీవిత సంఘటనల కొండకోనల్లో కురంగంలా విహరిస్తోంది.

* * * *

పాతికేళ్ళ క్రిందట మండుటెండల తలబిరుసుతనాన్ని తగ్గించగలిగే పాటి తొలి ముంగారు వానలకోసం మానవులు ఎదురుచూస్తున్న ఒకానొక గ్రీష్మకాలంలో ప్రారంభమవుతుందీకథ. ఆ రోజు ఉదయం రంగసముద్రంలో జిల్లాబోర్డు మాధ్యమిక పాఠశాలకు ప్రారంభోత్సవం జరిగింది. రంగసముద్రం పెద్దగ్రామం. చూట్టూరాదట్టంగా కొబ్బరితోటలున్నాయి. గ్రామంలో ఉత్సాహవంతులైన పెద్దమనుషులున్నారు. దండిగా కొబ్బరిమట్టలు తెప్పించి వాళ్ళు బడికోసమని కొత్తగా కట్టిన కట్టడంఎదుట పెద్దగా పందిరివేయించారు. బళ్ళతో యిసుకతెప్పించి పందిరిక్రింద పోయించారు. జిల్లాకలెక్టరుగారూ, విద్యాశాఖాధికారిగారు సభలో ఉపన్యసించి, లాంఛనంగా పాఠశాలను ప్రారంభించి ఉదయం పదిపదకొండు గంటలకల్లా వెళ్ళిపోయారు. మునసబుగారింటి నుంచీ కారియర్‌లో భోజనంవచ్చింది. భోజనంచేసి చేయికడుక్కుంటూ వుండగా నా కోసం ఎవరోవచ్చారని తెలిసింది. ఎవరైవుంటారా అని వితర్కించుకుంటూ వెలుపలికివచ్చాను. పందిరిక్రింద గుంజకానుకుని నిల్చున్న ఓ యువతి కనిపించింది. కట్టుకున్న తెల్లటిచీరలో, తొడుక్కున్న ఎర్రటి రవికలో ఆమె పుండరీక పుష్పంలా వుంది రాయంచ చంచువల్ల కాడదగ్గరగాయంలిని ఒక్కింతవాడిపోయి అప్పుడే తేరుకుంటున్న అల్లితామర పువ్వులా ఎండలో రోడ్డుదగ్గరనుంచీ నాలుగు ఫర్లాంగుల దూరం నడిచిరావడంతో ముంగురులు చెదరిపోయి ఆమెముఖం వాడిపోయింది. అంగ సౌష్టవంద్వారా ఆమెశారీరికారోగ్యాన్నీ, కళ్ళల్లో చిప్పిల్లుతున్న కాంతుల్నిబట్టి మానసికారోగ్యాన్నీ యిట్టేపోల్చుకోవచ్చు. ఇక లేదని అంచనా వేసినా ఆమె వయస్సు యిరవైరెండుకు మించినట్టు తోచదు. ద్వారందగ్గర నేను కనిపించగానే చేతులు జోడించి నమస్కరించింది. ఎందుకు, ఏమిటి, ఎవరు అన్న ప్రశ్నలు నా గొంతుకలో తారాడుతుండగానే చేతిసంచీలోనుంచీ ఓ కాగితం పైకి తీసింది.

"ఈరోజుదయమే నన్నిక్కడికి వెళ్ళమని అపాయింట్‌మెంటు ఆర్డరు చేతికిచ్చారు. మీకాపీ పోస్టులో వస్తుంది అందాకా వేచి చూచివాసదే ! ఇప్పుడే డ్యూటీలో చేర్చుకున్నా సరే ! ఏం చేసినా మీయిష్టం !"

"మిమ్మల్ని ఈ స్కూల్లో వేశారన్నమాట ?" ఆశ్చర్యంతో ప్రశ్నించాను.

"ఇదివరకొక ఎయిడెడ్ స్కూల్లో పనిచేసేదాన్ని ! జిల్లాబోర్డు ఉద్యోగానికి యిదే ప్రథమం! రంగసముద్రం చాలా మంచివూరన్నారు. పైగా పి. ఏ. గారు మిమ్మల్నిగురించిగూడా చెప్పారు......"

"ఏమని చెప్పారు ?"

"ఆయన చెప్పిందల్లా నేను చెబితే అదంతా పొగడ్తక్రిందికే వస్తుంది. ముక్తసరిగా చెప్పాలంటే ఆయన మీరు చాలామంచివారన్నారు. మీ దగ్గర పనిచేసే అదృష్టం అందరికీ దొరికేదికాదనికూడా అన్నారు...."

"కొంపదీసి మీరాయన మాటల్ని నమ్మేశారా ఏమిటి ?"

"అబ్బె, అలా తొందరపడే స్వభావంకాదు నాది ! కానీ యిక్కడికివచ్చి మీతో మాట్లాడినతర్వాత ఈ కొద్దిపాటి పరిచయంతో ఆయన మాటల్ని నమ్మవచ్చుననే అనిపిస్తోంది...."

"భలేవారే మీరు...." నవ్వుతూ ఆమె తీసుకొచ్చిన జిల్లాబోర్డువారి ఉత్తరువుకేసి చూచాను. దానిమూలంగా ఆమెనుగురించి నాకు తెలిసినవివరాలు చాలాతక్కువ. లేదంటే ఒకముఖ్యమైన వర్తమానం మాత్రం తెలిసింది ఆమె పేరు శకుంతల.

"మరిప్పుడు మీకు భోజనం ?"— అడిగాను

"రెండు పూటలకు చాలేటట్టుగా తెచ్చుకున్నాను రేపటినుంచీ వంట చేసుకుంటాను. నాకోసం మీరొకగది చూపెట్టగలిగితేచాలు ."

అలాగైతే నాకంటే ఆవిడ పరిస్థితే నయమన్నమాట ! శ్రీమతిగారు రెండోకాన్పుకోసం పుట్టింటికి వెళ్ళినరోజులు. ప్రసవమైనతరువాత మూడు మాసాలకుగానీ తిరిగిరాదు. అప్పటివరకూ నాకావుళ్ళో తిండికి ఠికాణా ఎలాగో అంతుపట్టడంలేదు

రంగసముద్రం మునసబుగారు శకుంతలకోసం ఓ పూరింటిని ఖాళీ చేయించి నివాసయోగ్యంగా రూపొందించారు. స్కూలు పదిగంటలకైతే ఆమె తొమ్మిదీ నలభైకలా వచ్చేసేది. క్లాసులో ప్రవేశించగానే పాఠం ప్రారంభించేది. పనిపూర్తికాగానే తలవంచుకుని తనదారంట తాను యింటికివెళ్ళిపోయేది ఉద్యోగానికి సంబంధించిన విషయాల్లో ఆమెను ప్రేలెత్తి చూపడానికిగానీ, సలహాలు యివ్వడానికిగానీ అవకాశముండేదిగాదు.

రోజులు గడిచిపోతున్నాయి.

చాలామంది పూర్వం బిరుదమిచ్చి పి. ఎ. గారు రంగసముద్రాన్ని మన్నన చేశారని చెప్పింది శకుంతల. మొదటమొదట నాకూ అలాంటి అభిప్రాయమే కలిగింది. పైగా నోరుమంచిదైతే వూరు మంచిదవుతుందని చెబుతారుగూడా. శకుంతల నోరు మంచిదవునో కాదో నాకుతెలియదు. కానైతే ఆమె నూటికి మితంగా మాట్లాడుతుంది. అందచందాలతో, విద్యావివేకాలతో బాటుగ అమితభాషిత్వంగూడా ఆమెకు సంబంధించిన ఆకర్షణల్లో ఒకటిగా పరిణమించింది. ఆమె పెదవి కదిపితే వాగమృతాన్ని గ్రోలాలనీ, నవ్వితే ముత్యాలు ఏరుకోవాలని ఎందరెందరు ఆకాంక్షించారో నేను చెప్పలేను! లోకం ద్వంద్వ ప్రవృత్తులకు నిలయం. వెలుగువెంట చీకటిలాగా, మంచీచెడూ ఒకదానివెంట ఒకటి వుండక తప్పదు. యువతీ, సౌందర్యవతీ శకుంతల హాయిగా పెళ్ళిచేసుకుని సాంసారిక జీవితమన్న కంచుకోటలో సురక్షితంగా కూర్చోకుండా ఆమె ఈ సంఘంలో ఒంటరిగా నిర్భయంగా ఎలా సంచరించగలుగుతోంది? ఎంతగా ఆలోచించినా ఈ ప్రశ్నకు సమాధానం తోచేదిగాదు. ఐనా యిలాంటి ఎడతెగని ఆలోచనల వల్ల శకుంతలకైనా, నాకైనా ఒరగబోయే దేముందిగనుక. ఏది ఎలాజరగాలో అలాగే జరిగితీరుతుంది. పాఠశాల సక్రమంగా నిర్వహింపబడడంవరకే ప్రధానోపాధ్యాయుడి బాధ్యత. అందులో పనిచేస్తున్నవారి వ్యక్తిగత గుణశీలాలను గురించిన చర్చ అతనికి అనవసరము, అప్రస్తుతంగూడా!

కానీ ఒకవ్యక్తిపైన వేరొకవ్యక్తి, ఒకవిషయంపైన వేరొకవిషయం ఆధారపడి ఏ వ్యక్తిగానీ, ఏ విషయంగానీ తనంతట తానుగా జీవించడానికి వీల్లేని ఈ ప్రపంచంలో కథ లేర్పడడానికి హేతువులు సైతం తమంతట తాము గా ఉత్పత్తిల్లకపోవు!— ఆ వూరివీదుగా పట్టణానికి వెళ్ళే బస్సులో స్వగ్రామం నుంచి భోజనంవచ్చే ఏర్పాటు చేసుకున్నాను. బస్సుల రాకపోకలు కేవలం మానవుల అదృష్ట దురదృష్టాలకు సంబంధించినవి. గతుకులరోడ్డుపైన ఆ బస్సువస్తే వచ్చేది, లేకుంటే ఎక్కడో శుభ్రంగా ఆగిపోయేది. బస్సురాదనీ, ఆ పూట కిక తిండిలేదనీ తేలిపోయిన పరిస్థితిలో నన్ను పస్తుగా వదిలిపెట్టి శకుంతల యింటికి వెళ్ళలేకపోయేది. "రండి మాష్టరుగారూ ఉన్న భోజనం మీకుపెట్టి నేను కావలిస్తే మళ్ళీ చేసుకోగలను. ఐనా ఎంతసేపు! పొయ్యిముట్టిస్తే పది నిముషాల్లో వంటం పోతుంది" అంటూ పట్టుబట్టి కూర్చునేది. అప్పటికీ పిలిచినప్పుడల్లా నే నామెకు అతిథిగా దాపురించేవాణ్నిగాను. గత్యంతరంలేక నే నప్పుడప్పుడు ఆమె ఆహ్వానాన్ని అంగీకరింపవలసివచ్చేది. ఆమాత్రానికే ఊహాపోహలు రగులుకోగలవని కలగని వున్నట్టయితే నే నలాంటిపనికి సాహసించేవాణ్ని గాను.

ఊహలు గాలిలాంటివి. అపోహలు వెదురుపొదలలాంటివి. ఒకదానికొకటి తోడైతే ఓ విచిత్రధ్వని ప్రారంభమవుతుంది. వెదుళ్ళ రాపిడిలో నుంచీ నిప్పు రవ్వలు పుట్టుకొచ్చి కార్చిచ్చు వ్యాపించడం గూడా అసంభవమేమీ కాదు.

నవాబుల దొరతనం దగ్గరినుంచీ పాళేగార్ల పాలనక్రింద ఉండిన గ్రామం రంగసముద్రం. ఈ కథాకాలం నాటికి పాళేగార్ల మందిరాలు భూతగృహాలు. ఒక దొర హయాం సన్నగిల్లితే వేరొక దొర బావుటా పైకి లేవడం చరిత్రలో ప్రసిద్ధం. సూరపరాజుగారు రంగసముద్రానికి ఏలికగాదు. కానీ ఆయన ఏలుబడి అప్రతిహతంగా పాతికేళ్ళపాటు సాగినమాట నిజం! ఆయన ఆడిందే మాట. గీచిందే గీటు. అంతకుమించి దబాయించడానికి వీలుండేదిగాదు. రంగసముద్రంలో నా ఉద్యోగజీవితం ప్రారంభమయ్యేనాటికి ఆయన లేచి నడయాడగలిగిన స్థితిలో లేడు. జరాభారం పైబడకపోయినా, పక్షవాతం ఒకటి బాగా కృంగదీయడంతో ఆయన బాహ్య ప్రపంచం పాలిటికి ఉన్నా లేనివాడయ్యాడు. తండ్రిగారి తక్తుపైన కూర్చోడానికి అప్పుడప్పుడే అలవాటు పడుతున్న నరసింహులు మాత్రం గ్రామంలో తరచుగా కనిపించేవాడు. తండ్రి కొక్కడే కొడుకు నరసింహులు మితిమీరిన గారాబం క్రింద శారీరక వికాసం జరిగినంతగా మనసు వికసించకపోయేసరికి అతడొక విచిత్ర ప్రాణిగా తయారయ్యాడు. ఆశించకమునుపే సంక్రమించిన పెద్దరికపు మైకంలో అతడు అడుగడుగునా తూలిపోవడం, అతడలా తూలిపోయిన సంఘటనలను కథలుగా చెప్పుకుని ఆ వూళ్ళో ఉన్న బుద్ధిమంతులు ఆనందించడం మరొక పరిపాటిగా పరిణమించిందని గూడా చెప్పవచ్చు. కానీ యిక్కడ చెప్పవచ్చిం దేమిటంటే పూటుగా తిని కండలు పెంచుకుని చేయదగిన పనేదీ స్ఫురించక గోళ్ళు గిళ్ళుకుంటున్న నరసింహులు తన ధ్యాసను శకుంతలపైకి మళ్లిస్తున్నాడన్న విషయం మాత్రం నాకు కాస్త ఆలస్యంగా తెలిసింది. ఓ రోజు తెల్లవారేసరికి వూరంతా గగ్గోలుగా ఉంది. ఎవరినోట విన్నా ఒకటే కథ. అర్ధరాత్రి కాబోతుండగా "దొంగ, దొంగ" అంటూ కేకలు వినిపించాయి. గ్రామస్థులు కొందరు ఉలికిపడి లేచి చేతికి దొరికిన కర్రలూ, కటారులూ తీసుకుని బయటి కొచ్చేశారు. నడివీథిలో నిలబడి ఉంది శకుంతల. ఎక్కడ, ఎక్కడ అన్న ప్రశ్నలు ఆమె చుట్టూరా ముసురుకున్నాయి. పెదవులైతే కంపిస్తున్నాయి గానీ శకుంతల నోట మాట పెకలడంలేదు. ఉన్నాడు, లోపలున్నాడు—అన్నట్టుగా ఆమె ఇంటివైపు చూస్తోంది. గొళ్ళెంతీసి తలుపు తెరిచి ద్వారానికి అడ్డంగా నిల్చున్నారు గ్రామస్థులు. మంచి మాటలతో బయటికి వస్తే సరేసరి లేకుంటే తామే లోపల ప్రవేశించి ఒళ్ళంతా హూనం చేయగలమని దొంగకు అల్టిమేటమ్ జారీచేశారు. వాళ్లంతపని చేసినా చేయగలరనుకున్నాడేమో, ఆ దొంగ తటాలున బయటికి వచ్చి తప్పించుకుని పారిపోజూచాడు. కానీ అతడి దురదృష్టంకొద్దీ ఆయుధపాణులైన గ్రామస్థులు అప్రమత్తులుగా ఉన్నారు. వాళ్ల ఆయుధాలు ఒక్కుమ్మడిగా దొంగపైన మోహరించాయి. ఆ అలజడిలో దొంగ ముఖం నిండుకూ కప్పుకున్న ముసుగు కాస్త వూడిపోయింది. ఊడిపోగా తెలిసింది—అతడు దొంగకాదు చిన్నదొర! సూరపరాజుగారి కుమారరత్నం!

మరునాటి ఉదయం రిజిష్టరులో సంతకము చేసింది శకుంతల— "భారతదేశం వీర నారీమణులకు పుట్టినిల్లని చదితే ఏమిటో అనుకునేవాణ్ని! ఆ మాటలో నిజం లేకపోలేదన్నమాట!" అంటూ ఆమె కొక కాంప్లిమెంటు బహూకరించాను.

వివరించింది శకుంతల—రాత్రి పది పదకొండు గంటలప్పుడు తనేమో దీపం దగ్గర కూర్చుని చదువుకుంటూ ఉండగా తలుపుపైన మెల్లగా సవ్వడి వినవచ్చింది. గడియతీసి తలుపు తెరిచిన క్షణంలో శకుంతల స్తబ్ధురాలైపోయింది. ద్వారానికి అవతలివైపున నిల్చున్న వ్యక్తి నరసింహులు! శకుంతల అలా ప్రమాన్పడి చూస్తుండగానే నరసింహులు లోపలికి వచ్చేశాడు. ఏం చేస్తుంది శకుంతల? అదృష్టవశాత్తు ఆమె బుర్రలో ఓ వూహ మెరిసింది. లేడిపిల్లలా ఒక అడుగులో బయటికి దూకి ఆమె తలుపు మూసి చిలుకు తగిలించేసింది.

ఆ తరువాత జరిగిన కథ అందరూ వెండితెరపైన చూచి ఆనందించినదే!

ధైర్యసాహసాల మాట దేవు డెరుగు గానీ యిందుమూలంగా బలవద్విరోధాన్ని కొని తెచ్చుకున్నట్టయింది ......" అంటూ వేగంగా నిట్టూర్చింది శకుంతల.

దీనంగా దిగులుగా చిన్నబోయిన శకుంతల ముఖాన్ని చూస్తూ ఖిన్నుడనైపోయాను.

నూలువుండలాంటి జీవితంలో ఒకచోట ఏర్పడిన చిక్కు అలాంటి మరికొన్ని చిక్కులకు దారితీస్తుంది. శకుంతల విషయంలో గూడా జరిగిందదే! నరసింహులు చాటునా, మాటునా పొంచివుండి తనపైకి నిశిత వీక్షణాలు బరపుతున్నాడని చెబుతుండేది శకుంతల. అడపాదడపా అతగాడి క్రూర వీక్షణాలు నన్ను సైతం వెంటాడుతుండేవి. అంగబలానికీ, అర్థబలానికీ కొదువలేనివాడు నరసింహులు. మీదు మిక్కిలి అతడిప్పుడు కుపిత వ్యాఘ్రంలా రొప్పుతున్నాడు. దండతాడిత భుజంగంలా బుసలు పెడుతున్నాడు. అతడేం చేయదలుచుకున్నా చేయగలడు! కానీ ఏం చేస్తాడు? జీవితంలోకి చొచ్చుకొని రాగల చిక్కుల స్వరూపాన్ని గురించి ముందుగా వూహించలేని మానవుడు నిజంగా దురదృష్టవంతుడు.

కానీ ఏమాట కామాటే చెప్పుకోవాలి. నరసింహులు పల్లెటూరి పొలిమేరలు దాటి ఎరుగనివాడు. బాహ్య ప్రవర్తనలో లాగానే అతడు మనసులో సైతం మోటువాడు. ఒక వ్యక్తిపైన అతనికి ద్వేషం కలిగినప్పుడు, కక్షను తీర్చుకోడానికి అతనికి తెలిసిన ఉపాయం ఒక్కటే! అతడు బడితెపూజ చేయగలడు. లేదా చేయించగలడు. అంతేగానీ చెట్టు అలా ఉండగానే వేళ్ళను తెంచివేసే నాజూకుతరహా ప్రతీకార చర్యలు అతడికి చేతగావు ఎంతగా మోటువాడైనా శకుంతలపైన పశుబలం ప్రదర్శించాలన్న బుద్ధి నరసింహులకు పుట్టిందిగాదు. అతనిలో రగులుకున్న నిప్పు కాలక్రమాన చప్పబడి చల్లారిపోయే అవకాశం సైతం లేకపోలేదు. కానీ అలాంటి మంచి పరిణామానికి విధి అనుకూలించింది గాదు పులిమీద పుట్రలా ఉన్న అగ్నికి లేని ఆజ్యం ఒకటి తోడైనట్టుగా అప్పుడొక కొత్త వ్యక్తి రంగంలో ప్రవేశించాడు.

అతడి పేరు రామ్మూర్తి. బాంధవ్యరీత్యా శకుంతలకు వేలు విడిచిన మేనత్త కొడుకు ఆడబిడ్డ పుట్టగానే యిది ఫలానావాడి పెళ్లామన్న దురాలోచనకు పూనుకోడం పెద్దల సాంప్రదాయం. పెద్దవాళ్ళ వూహను పురస్కరించుకొని, తదనంతరం దోహదక్రియగా శకుంతలకు ప్రేమలేఖలు వ్రాయటం ప్రారంభించాడు రామ్మూర్తి.

వ్రాసినంత కాలం వ్రాశాడు. కానీ ఎంతకూ యువతివైపు నుంచీ రెస్పాన్సు లేకపోయేసరికి అతడు సరిక్రొత్త పద్ధతులకోసం అన్వేషింపసాగాడు. వోరోజు టపా చూస్తూండగా నాకో ఉత్తరం కనిపించింది. ఒకానొక అపరిచితుడు నా పేరిటకు వ్రాసిన ఆ ఉత్తరం నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించింది —నా మంచితనాన్ని అతగాడికెవరో తెలివిడి చేశారట! అంతటి మంచివాణ్ణి కనుక నేను శకుంతలను కంటికి రెప్పలా కాపాడగలనట! ఆ నమ్మకంతోనే తాను నిశ్చింతగా ఉండగలుగుతున్నాడట!

ఆ ఉత్తరాన్ని శకుంతలకు చూపించడం మినహాగా నేను చేయగలిగిందేముంది? అదేపని చేశాను అడివిలోని పచ్చికను మేస్తూ, సెలయేటి నీళ్ళు త్రాగుతూ తన బ్రతుకు తాను బ్రతికే లేడిపిల్లకోసం ఉరులొడ్డడం వేటగాడి సహజగుణం! సమాజంలో అందమైన యువతి బ్రతుకు అంతకంటే పదిలంగా ఉన్నట్టు లేదు. తనపట యింతగా చొరవ దీసుకుంటున్న రామ్మూర్తి, మరెంతటి పనికైనా వెనుదీయడేమోనన్న వూహలో కంపించిపోతోంది శకుంతల

"ఇతగాడికెవరూ గడ్డి పెట్టేవాళ్లు లేరా?" అని నేనే ప్రశ్నించాను

"ఎవరున్నారు మేష్టరుగారూ! ఉన్నా అతడెవరిమాటా వినిపించుకుంటాడు గనుక! తండ్రి లేడు. తల్లి మాత్రం ఉంది ఆ తల్లికి యితడొక్కడే కొడుకు సెకండ్‌ఫారం దాకా చదువుకున్నాడు ఆతరువాత జులాయిగా వూళ్ళవెంట తిరిగాడు. పేకాటలో నిపుణుడు. గంటకొక సిగరెట్టు పెట్టె కాల్చేస్తాడు డబ్బు కావలసినప్పుడల్లా ఇంటికి వచ్చి చెంబు తప్పేలా లాంటి వేవైనా దొరికితే అయినకాడికి అమ్మేస్తాడు ఇదేమని అడిగితే తల్లిపైన చేయి చేసుకుంటాడు. ముసలావిడ పెంకు లెగిరిపోయేటట్టుగా ఏడుస్తుంది ఇతడేమో అయిపులేకుండా పారిపోతాడు. ఆ మధ్య ఏం జరిగిందో నాకైతే సరిగా తెలియదు. కానీ అదేదో స్టేషనులో జేబులు కత్తిరించాడని, ఆరు వారాలపాటు జైల్లో ఉండి వచ్చాడనీ చెప్పుకున్నారు.. ."

సదరు రామ్మూర్తి పొడుగ్గా పైజమా వేసుకుని, ఆజాను పర్యంతంగా జుబ్బా తొడుక్కుని, మెడకు రుమాలా చుట్టుకుని నొక్కుల క్రాపింగుతో వూళ్ళోకి దిగాడన్న వార్త ఓరోజు ఉదయం నా చెవిదాకా వచ్చింది.

పల్లెటూరి వాతావరణంలో ఎలాంటి చిన్న సంఘటనైనా పెద్ద సంచలనానికి దారితీస్తుంది రామ్మూర్తి రాక, అతడిపట్ల శకుంతల ప్రకటించిన వైముఖ్యం మున్నగు విషయాలు గ్రామస్తుల కాలక్షేపానికి మేతగా ఉపకరించాయి. వూళ్ళోకి వచ్చిన కొద్దిసేపటికే రామ్మూర్తికి, కొందరు సానుభూతిపరులు ఏర్పడ్డారు. ఆ సానుభూతిపరుల సమాఖ్యకు నరసింహులు నాయకత్వంవహించాడు. శకుంతల మూలంగా రామ్మూర్తికేదో అన్యాయం జరిగిందన్న అబద్ధం పదుగురినోళ్ళల్లో నాని అదొక నిజంగా చెలామణీ కాసాగింది. జరిగిన అన్యాయానికి రామ్మూర్తి ప్రతీకారం చేయదలచుకుంటే అందుకు తన తోడ్పాటు పూర్తిగా వుంటుందని నరసింహులు బాహాటంగానే చెప్పుకోసాగాడు.

ఈ సారి వ్యూహ రచనకు ఉపక్రమించినవాడు రామ్మూర్తి. పదివూళ్ళు తిరిగి, పదిచోట్ల తన్నులుతిని ఆ విధంగా సంపాదించిన తెలివితేటలు రామ్మూర్తికి పుష్కలంగా వున్నాయి. కేవలం శకుంతలను సాధించడానికేగాక, మరికొన్ని స్వంత ప్రయోజనాలకోసంగూడా నరసింహులను వాడుకోవచ్చునని రామ్మూర్తి అనతికాలంలోనే గ్రహించాడు. నరసింహులకు తెలియనిది ప్రపంచం తనకు లేనిది డబ్బు. రామ్మూర్తి మొదటిపనిగా నరసింహుల్ని నాలుగూళ్ళు తిప్పించాడు. బయస్కోపులు చూపించాడు. జూదాల్లో కూర్చోబెట్టి లాటరీలో రుచి కలిగించాడు మాదక పదార్థంలాంటిది రామ్మూర్తి స్నేహం. ఆ స్నేహంలో కొత్తలోకాలు కనిపించినకొద్దీ, కొత్తరుచులు అనుభవానికి వచ్చినకొద్దీ ఉప్పూకారం లేని తన బ్రతుక్కు ఉజ్వలమైన భవిష్యత్తును చూపించేస్తున్న మార్గదర్శకుడిగా రామ్మూర్తిని నరసింహులు ఆరాధింపసాగారు. నరసింహుల్ని పూర్తిగా తన ప్రభావంలోకి లాక్కున్న మరుక్షణంలో రామ్మూర్తి తనవ్యూహానికి శ్రీకారం చుట్టాడు. వూళ్ళో లెక్కలేనన్ని కట్టుకథలు అల్లుకోసాగాయి. పాఠశాల ప్రాంగణంనుంచీ ఈవలికివస్తే ఏ మారుపేరు వినిపిస్తుందోనని భయపడడం ఊపిరి పీల్చడంలా సహజమైపోయింది. గ్రామంలో కొత్తగా నెలకొన్న విద్యాసంస్థపట్ల అత్యంత శ్రద్ధాశక్తులు ప్రకటించిన పెద్దమనుషులుసైతం ఒక్కరొక్కరుగా బడివైపు రావడం మానేశారు. దారిలో ఎక్కడైనా ఎదురైతే ముఖావంగా చూచీచూడనట్టుగా వెళ్ళిపోయేటంతవరకూ వాళ్ళు ప్రధానోపాధ్యాయుడి పొలకువను కంటగించుకోసాగారు

తలపైకెత్తి సూటిగా శకుంతల ముఖంలోకి చూడలేకపోయేవాణ్ణి నేను! ఆమెగూడా వీలైనంతవరకూ నా ఎదుటపడకుండా ముఖం చాటుచేసుకుని తిరగడానికే ప్రయత్నించేది కానీ నేను హెడ్మాస్టరునుగా, ఆమె అసిస్టెంటుగా పనిచేయవలసిన పరిస్థితిలో ఒకరినొకరు కలుసుకోకపోవడం, మాట్లాడుకోకపోవడం ఎలాసాధ్యమవుతుంది? పైకెంత ప్రశాంతంగా వుండాలని ప్రయత్నించినా హృదయాల్లో బడబాగ్ని ప్రజ్వరిల్లుతుంది. నా ప్రవర్తనతోగానీ, శకుంతల ప్రవర్తనతోగానీ ప్రమేయంలేకుండా యింతదూరం యిలా కొనసాగిన ఈ కథ ఎలా అంతమవుతుందో నాకు తెలిసేదికాదు. ..

ఏవో సెలవులొచ్చాయి. స్వగ్రామంవెళ్ళాను. ఆపాటికి శ్రీమతిగూడా పుట్టింటినుంచీ తిరిగిరావడం జరిగింది. కంటికి కనిపించడమేగానీ ఆవిడ పెదవి కదపదు ఏమిటీ విడ్డూరం? మూగది కాదే! అలుక వహించడానికి కారణం కన్పట్టదే! మరొకవైపున నాన్నగారి ధోరణిగూడా అదొకరకంగావుంది. ముఖం కందగడ్డలా చేసుకున్నారాయన. పలకరించడానికి వెళ్ళినప్పుడల్లా చూపులు భూపతనంకాగా పెడముఖం పెడుతున్నారు. తప్పుచేసినా ఒప్పుచేసినా బిడ్డను బిడ్డగా చూచేస్వభావం ఒక్కతల్లికిమాత్రమే వుందేమో! అమ్మద్వారా అసలుసంగతి తెలిసింది. ఇక్కడ నాన్నగారి పేరిటకొకటి, అక్కడ మామగారి పేరిట కొకటి, ఆకాశరామన్న ఉత్తరాలు వచ్చాయట! 'అమ్మాయి ఆ బాబుల్ని పెట్టెలో భద్రపరచుకుందిరా బాబూ! ఏం చెప్పుకుంటావోమరి" అంటూ అమ్మ ఆలోచించుకోడానికి నాకొక అవకాశం మాత్రం ఇవ్వగలిగింది. నచ్చచెప్పి ఒప్పించడానికి విషయం సామాన్యమా, అవతలివ్యక్తులు విద్యార్థులాగారు. ఐనా ప్రయత్నించి చూచాను. సత్ఫలితంగా కనిపించకపోగా కింకర్తవ్యతా విమూఢత మాత్రం మిగిలింది.

అంచెలంచెలుగా కొనసాగుతున్న రామ్మూర్తి వ్యూహంలో ఆఖరు ఘట్టం రంగసముద్రం తిరిగివెళ్ళేసరికి నాకోసం కాచుకునివుంది.

బొగ్గులకోసం కల్పతరువును పొడవడం గొప్ప దోషమంటారు. ఆ బొగ్గులతో తెల్లటి గోడలను ఖరాబు చేయడం అంత పెద్ద దోషం కాకపోవచ్చు. కానీ మకిలి అక్కరాలతో వ్యక్తుల గుణశీలాలపైన మాసిపోని మాలిన్యం పూయడానికి ప్రయత్నించడం తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాన్ని ఆశించడానికి వీలున్న సులభోపాయం. బస్సు స్టాండులో దిగినప్పటినుంచీ, పాఠశాలలో

అడుగుపెట్టేదాకా దారిలో కనిపించిన ప్రతి తెల్లటి గోడా అపహాస్యం చేయ డానికే పూనుకొంటే ఎమిలి కుమిలి లోలోపల ఏడవడంకన్నా ఈ మంద భాగ్యుడు చేయగలిగిం దేముంది ?

ఆఫీసు రూంలో ప్రవేశించాను ఉద్యోగానికి రాజీనామా యిస్తూ శకుంతల వ్రాసుకున్న కాగితం టేబులుపైన కనిపించింది

చదివి ముగించేసరికి మెల్లగా లోపలికి వస్తున్న శకుంతల కనిపించింది

శకుంతలను నేను చూడడం అదే ఆఖరుసారి ఆమె ముఖంలో శోకం గిరికీలు తిరుగుతోంది శకుంతల ఆడది. ఏడ్చినా ఆమెకు చెల్లు ! మగవాణ్ని. ఎలాంటి దుర్ఘటన ఎదురైనా గరళంలా దిగమింగి గాంభీర్యం వెలార్చవలసిన వాణ్ణి అవమానం ఎనైతే సేరుగలిగాను ఓదార్చగలిగేపాటి నిబ్బరం లేక పోయింది

"మీరు రాకుముందే వెళ్లిపోదా మనుకున్నాను. కానీ చెప్పకుండా వెళ్తే అదొక వెలితిగా ఉంటుందేమో ననిపించింది ....."

ఒక నిమిషం నిశ్శబ్దంగా గడిచిపోయింది

"పి ఎ గారు రంగసముద్రం మంచి వూ రన్నారు. మిమ్మల్ని గురించీ చెప్పారు ఆయన ఈ వూరిని గురించి చెప్పిన మాట మాత్రం తల్కిందు లైంది నా గ్రహచారానికి ఎవరేం చేయగలరు గానీ, నామూలంగా మీకున్న మంచి పేరుకు కూడా దెబ్బ తగిలింది. అందుకు మీరు నన్ను మన్నిస్తారా మేష్టారుగారూ !"

ఎప్పుడు చేయవలసిన పని అప్పుడు చేయకపోతే, ఎప్పుడు చెప్పవలసిన మాట అప్పుడు చెప్పకపోతే జరిగిన పొరబాటుకోసం జీవితాంతం విచారించ వలసి ఉంటుంది ఒకదాని తరువాత ఒకటిగా తగిలిన దారుణాఘాతాల తాకి డికి బుద్ధి స్తబ్ధమై పోవడంవల్లనే గావచ్చు, శకుంతల కేం చెప్పుకోవాలో తోచిందిగాదు కాకపోతే నేను శకుంతలను మన్నించవలసిన పమేయుం ఏముంది ? ఆమె ఏం నేరం చేసిందని ? కొన్ని పరిస్థితులు, కొందర వ్యక్తులు కూడబలుక్కుని ఆరోపించిన చేయని నేరం ఏదైతే ఉందో, దాని వల్ల ఎక్కువగా నష్టపోయిన వ్యక్తి శకుంతల. వేశ్యల్ని పోషించడం మగ సిరికి పట్టాభిషేకంగా తలపోసిన ఈ సమాజంలో మగవాడి దుశ్శీలతను గురించి అంతగా పట్టించుకునేవాళ్లు లేరు శకుంతల జీవితమంతా యుక ముందే ఉంది ఆదిలోనే ఏర్పడిన ఈ హంసపాదును ఆమె ఎలా చెరుపుకో గలుగుతుంది ? ఎన్నాళ్లకు చెరుపుకో గలుగుతుంది ?

జరిగిన అనర్థాల కన్నింటికీ తన గ్రహచారమే కారణమన్న ఓదార్పుతో జీవితంలో ఓ విషాదాధ్యాయాన్ని ముగించి, మళ్లీ కనిపిస్తాం దనుకోడానికి ఆస్కారం లేకుండా ఎక్కడికో వెళ్లిపోతున్న ఆ అబలసమక్షంలో నా సబలత్వా నికి మూగతనం సిద్ధించింది.

శకుంతల చెప్పుకపోతోంది—

"మూడు మాసాలనాడే అనిపించింది. ఈ ఉద్యోగానికి స్వస్తిచెప్పి ఇక్కడినుంచి వెళ్లిపోవడమే శ్రేయస్కరమని ! కానీ వెళ్లలేకపోయాను. కారణం చెప్పమంటారా మేష్టారుగారూ ! దీనితో నా కవసరం ఉంది నాకోస మని కాదు. మా నాన్నగారు పదేళ్లప్పుడే పోయారు. తల్లి, వినా పెద్ద దిక్కు లేదు ఒక్క చెల్లె లుంది ఇద్దరు తమ్ముళ్లున్నారు. పిల్లలు చదువుకుంటు న్నారు. వాళ్ల బతుకులు తిన్నగా గడవడానికి నా జీతపురాళ్లు మినహాగా మరే ఆధారమూ లేదు ఉద్యోగం వూడిపోతే ఏమవుతుంది ? ఎక్కడో ప్రమాదం జరిగితే ఎక్కడి రైళ్లు అక్కడే ఆగిపోడంలేదా మేష్టారుగారూ ! అలాంటిదే జరుగుతుంది. ఐనా మార్గాంతరం లేకపోయింది"

డగ్గుత్తిక మాట్లాడనిచ్చింది గాదు బహుశా ఆ విరామంలో శకుంతల కన్నీటిని తుడుచుకుని ఉంటుంది

"భగవంతుడి సృష్టిలో ఎలాంటి అల్పప్రాణికైనా తన అంతస్తుకు తగినంతగా ఆశలు ఆశయాలు ఉండటంలేదా మేష్టారుగారూ ! నాకూ అలాగే కొన్ని కోరిక లుండేవి పరీక్షల్లో కడతేరితే, ఉద్యోగం పెరిగితే తమ్ముళ్లకు, చెల్లెలికి మరింతగా తోడ్పడగలిగి వుండేదాన్ని ఆ ఆశలన్నీ అడియాసలై పోయాయి మొదటికే మోసం వచ్చింది. ఇహ ఫరవాలేదు రాముడు, రాజ్యమూ చల్లగా ఉన్నంతవరకూ ఎంతటి దీనులకైనా బతుకు గడవకపోదు. అదే నా విశ్వాసం. వెళ్లొస్తాను మేష్టారుగారూ ! మీ ఆశీస్సులు మాత్రమే నాకు కావలసింది . ."

చేతులు జోడించింది శకుంతల. గదిలోకి ఎలా వచ్చిందో అలాగే మెల్లగా వెళ్లిపోయింది

అద్దంలోనుంచి నీడ నిరమించినట్టుగా శకుంతల అలా వెళ్లిపోయిన తరువాత పాతికేళ్లు గడచిపోయాయి

వాకబుచేసి చూశాను చిరునామా సాయంతో పట్టణంలో యిల్లు కనుక్కున్నాను అది ఏడెనిమిది కాపురాలు పిచ్చుకగూళ్లలాంటి గదుల్లో కాపురాలు చేస్తున్న చుట్టు భవంతి ఇల్లు ఇంటి యజమాని ఆ కుటుంబం నాటా ఖాళీచేసి వెళ్లిపోయిందని మాత్రం చెప్పగలిగాడు శకుంతలను గురించి తెలుసుకోడానికి మిగిలినవున్న ఒకే ఒక ఆధారం గూడా ఆవిధంగా విఫలమై పోయింది.

ఎన్నడో చదివిన దుఃఖగాథలా శకుంతలకు సంబంధించిన స్మృతి ఒక విషాదానుభూతిగా మిగిలిపోయింది

ఐతే ఆనాటిరాత్రి ఆతిథ్య మిచ్చిన బంధువు ఇంట్లో యింతగా గడచిన గాథను సింహావలోకనం చేసుకుంటూ నిద్రలేకుండా గడపవలసిన చిత్త క్షోభను తెచ్చిపెట్టింది శకుంతల మాత్రం కాదు కాలాన్ని భగవంతుడి స్వరూపంగా అభివర్ణిస్తారు. ఆ కాలం మానవులకు వాళ్లవాళ్ల తాహతుకు తగట్టుగా కొత్తకొత్త వేషాలు బహూకరిస్తూ వెళ్తుంది తాము దాల్చిన సరికొత్త వేషంలో రామ్మూర్తికి కాలపురుషుడు వేసిన మేకప్ చాలా దొడ్డది శౌతికాకారంలో మరీ అంతగా మార్పులు రాకుండా చెక్కల కొట్లో కునికి పాట్లు పడుతున్న నరసింహులు కనిపించబట్టి సరిపోయింది గానీ, లేకుంటే రామ్మూర్తిని గుర్తుపట్టడం యించుమించు అసాధ్యంగా పరిణమించి ఉండేది.

శకుంతల, రామ్మూర్తి, నరసింహులు ముఖ్య పాత్రలుగా మనోఫలకం పైన వలయాలుగా తిరిగిపోతున్న పాత జ్ఞాపకాల నన్నింటినీ తుడిచిపెట్టు కునేసరికి రెండో ఆట కూడా వదిలిపెట్టారు. నిద్ర పట్టబోతుండగా ఓ వూహ తట్టింది శకుంతలకు రామ్మూర్తి దగ్గరి బంధువు పైగా అందని పండుకోసం అర్రులుచాచి, అందదని తేలిపోవడంతో దానిపైకి రాళ్లు విసిరి ఆవిధంగా ఆనందించినవాడు అతడు పీడలా శకుంతలను మరి కొంత దూరం వెంటాడి ఉండకపోడు శకుంతల ఏమైందీ రామ్మూర్తికి తెలిసి ఉంటుంది. ఒకసారి పిలుచేసుకుని అతనితో మాట్లాడితే ?

మాట్లాడాను. వూరూ పేరూ చెప్పుకోగానే రామ్మూర్తి నన్ను పోల్చుకో గలిగాడు. రిక్షాలో ఎక్కిన ప్రతి వ్యక్తినీ పరకాయించి చూడవలసిన అవ సరం తనకు లేదనీ, అలా చూచి ఉంటే క్రితం రోజు రాత్రే నన్ను అవలీ లగా గుర్తుపట్టి ఉండవచ్చుననీ వివరించాడు. రిక్షా త్రొక్కడం లోకులను కుంటున్నంత నామర్దా పని గాదనీ, దాని గౌరవం దానికీ ఉందనీ తాను చేబట్టిన వృత్తిని సమర్థించుకున్నాడు అతన్ని కలుసుకోడంలో నా ఉద్దేశం అతన్నిగానీ, అతడి వృత్తినిగానీ కించపరచడం కాదనీ, చెమటోడ్చి పనిచేసి సంపాదించి గంజి వాళ్లు త్రాగడం కన్నా గౌరవప్రదమైన జీవితవిధానం మరొకటి లేదనీ నా అభిప్రాయాన్ని గూడా వెలిబుచ్చి చేసుకున్నాను.

కానీ తీరా శకుంతల ప్రస్తావన వచ్చేసరికి రామ్మూర్తి ముఖ కవళికలు మారిపోయాయి ఓ క్షణంపాటు నా ముఖంకేసి ఆశ్చర్యంగా చూసి అతడు పెద్ద పెట్టున నవ్వేశాడు.

"అదేమిటి రామ్మూర్తీ ! ఎందుకలా నవ్వుతున్నావు ? ఏం జరిగింది శకుంతలకు ?" రామ్మూర్తి హావభావాల్లో అమంగళాన్ని శంకించి నేను కంగారుపడిన మాట నిజం !

"ఏం జరుగుతుంది ? ఏది జరగాలో అదే జరుగుతుంది. ఎంతటి పిచ్చితనం మేష్టారూ ! తెల్లనివన్నీ పాలే ననుకున్నారు మీరు !" బీడీ ముట్టించి బిగ్గరగా దమ్ము లాగి పొగలో ఉక్కిరిబిక్కిరిగా దగ్గుతూ కొనసాగించాడు రామ్మూర్తి—"రంగసముద్రంనుంచీ తిరిగి వెళ్ళిందా మేష్టారూ ! వెళ్ళి ఊరుకుందేమిటి ? ఈసారి పెద్ద చేపకే వేయాలనుకుంది గాలం !"

"గాలమా ?" తెల్లబోయాను.

"కాకపోతే మరేమిటి ? పై పటారం చూచి బాగా డబ్బున్న ఆసామీ అనుకుంది. అతగా డెవరో కొంపలకు కొంపలే ఆర్పేసిన ఘటం ! పెళ్ళిదాకా రాదీశాడు కథ. ముచ్చటగా మూడు నెలలు కాపురం చేయనిచ్చి తన్ని తగలేశాడు పుట్టింటికి !"

"ఇలాంటి దుర్వర్తమానం వినవలసి ఉంటుందని తెలిస్తే నేను నిన్ను కలుసుకుని వుండేవాణ్ణికాను రామ్మూర్తీ !" అంటూ నిట్టూర్చాను.

"అప్పుడే ఏమైంది.? ముందున్నదే ముసళ్ళ పండుగ. మళ్ళీ ఎక్కడో, ఉద్యోగంలో చేరింది. ఐనా సుఖపడేరాత ఉండొద్దూ ! ఆ మొగుడు చీటికీ మాటికీ దాపురించేవాడు. పీడించి డబ్బు లాక్కునేవాడు ఇవ్వనని మంకుతనం చేస్తే రాక్షసుడిలా పై కెగబడి ఒళ్ళు హూనం చేసేవాడు. ఇక్కడ ఇంట్లో చూడబోతే పూటపూటకూ లాటరీలాంటి వ్యవహారం. ఏం చేస్తుంది ? అలాగే పది పదిహేనేళ్ళపాటు రథం లాగింది. బక్కచిక్కిపోయింది. కళ్ళల్లో మాత్రమే ఉండేవి ప్రాణాలు. ఇంత లక్షణమైన బ్రతుక్కు టి. బి. ఒకటి తోడైంది. ఇటీవలే ఎవరో చెప్పారు—ఏదో శానిటోరియంలో ఉందని ! నిజమే కాబోలు ననుకున్నాను. శానిటోరియం వెళ్ళిన మాట నిజమే ! కానీ అక్కడ డబ్బి వ్వందే ఎలా చేర్చుకుంటారు ? చికిత్స లేకపోతే జబ్బెలా నయమౌతుంది ? ఈ కడగండ్లన్నీ మనిషిని మనిషిగా ఉంచుతాయా మేష్టారూ ! మతి స్థిమితం తప్పి ఆ మనిషి దేశాలపాలై పోయిందని తెలిస్తే మాత్రం మీ రిప్పుడు ఆశ్చర్య పడతారు గనుకనా ! ....."

వింటూ వింటూ పారిపోతే చెబుతున్నవాడికి కోపం రావచ్చను గనుక అలాంటి పని మాత్రం చేయలేకపోయాను. మానవుడు కొన్ని నిజాలను విశ్వసిస్తాడు. ఆ నిజాల పునాదులపైన ప్రపంచంలో అతడి జీవితం సాగిపోతుంది. ఆ నిజాల మనుగడకే సేగి వాటిల్లినట్టు తెలిస్తే అతడి మనసులో తీరని అశాంతి రగులుకుంటుంది. తాను నమ్మిన నిజ మేదైతే ఉంటుందో అది జీవితానికి ఏలికలాంటిది. ఏలిక మరణిస్తే ఏమవుతుంది ? రాజ్యంలో అరాచకం నెలకొంటుంది. అరాచకం అవ్యవస్థకు దారితీస్తుంది. అవ్యవస్థ అశాంతికి హేతువు.

ఆ రోజు సాయంత్రం వీధిలో నడుస్తుంటే వూరిలో సంచరిస్తున్నట్టు లేదు. అడవిలో దిక్కులు తెలియకుండా పరిభ్రమించినట్టుంది. గర్భగుడిలో ప్రవేశించి దేవుడికి బదులుగా దయ్యాన్ని కళ్ళజూచినవాడి పరిస్థితి ఎలాంటిది? అలాంటి నిర్వేదంతో తిరుగుదారి పట్టాను.

* * *

కథకు ముడిసరుకు మానవజీవితమే ననుకున్నట్టయితే ఆ జీవితమే ముగింపుకు వచ్చినప్పుడు చెప్పడాని కింక మిగిలేదేముంది ? ఎప్పటికప్పుడు జీవనయాత్రాపథంలో ఎదురయ్యే నైరాశ్యాలను భరించగలిగితే చాలు. గత కాలపు దుఃఖస్మృతులతో మనసుకు క్లేశం కలిగించుకోడ మెందుకు ? ఏ కథ లోనో, నవలలోనో యాదృచ్ఛికంగా శకుంతల అన్న పేరు కనిపిస్తే ఆ రచన నంతటితో చదవడం మానేసేవాణ్ణి. ఒకసారి మేటి నటీనట వర్గంతో శకుంతల నాటక ప్రదర్శనం జరిగింది. స్నేహాన్ని పాటించి నిర్వాహకుడు ఫ్రీపాసు గూడా పంపాడు. కానీ వెళ్ళలేకపోయాను. శకుంతల కణ్వర్షి దుహితే కావచ్చు. లేదా ఒక నటీమణి రంగంపైన ధరిస్తున్న పాత్రేగావచ్చు వెళ్ళి కూర్చున్న నేరానికి నేను మాత్రం పాత జ్ఞాపకాల బరువుతో కృంగిపోకతప్పదు.

కానీ మరచిపోదలుచుకున్న విషయాన్ని తప్పనిసరిగా మననం చేసుకో వలసిన అవసరం వస్తుందని నాకేం తెలుసు ?

కాలం మూడేళ్ళ తరువాత. స్థలం తిరుపతి రైల్వే స్టేషను. మామూలు పెట్టెల్లోకి జొరబడడానికి మల్లయుద్ధంలో నైపుణ్యం అవసరం. ఆడవాళ్ళు అలాంటి పాడు పనికి ఎలా పూనుకోగలరు ? రైలు ఆగగానే మా ఆవిడకోసం ఆడవాళ్ళ పెట్టె దగ్గరకు పరుగుదీశాను.

ఇంకా భళ్ళున తెల్లవారలేదు. శేషాచల శిఖరాలపైనుంచీ అల్లనల్లన మలయానిలం వీస్తోంది అనతిదూరంలో ఎక్కడో సన్నాయి మేళం. చుట్టూరా 'ఎత్తు, దిగు, తప్పుకో' అంటూ యాత్రికుల సంరంభం.

"ఈ పెట్టెలో మిమ్మల్నెరిగిన వాళ్ళున్నారు" అంది మా ఆవిడ.

నన్నెరిగినవాళ్ళకు మా ఆవిడ తెలియకపోవడ మేమిటి ? తెలియదనే అనుకుందాం. వాళ్ళు నన్నెరుగుదురని ఈవిడ కెలా తెలిసింది ?

నా సందేహాల్లో నే నున్నాను. "నమస్కారమండీ మేష్టరుగారూ!"— పలకరింపు వినిపించింది.

నడి వయసులో ఉన్న ముత్తయిదువ. ఒకింత స్థూలంగా ఉంది. ఆకుపచ్చని సిల్కుచీర. దేహచ్ఛాయలో కలిసిపోతున్న సువర్ణాభరణాలు. తలలో చేమంతిపువ్వులు. నుదుట కుంకుమబొట్టు. పలకరిస్తూ ఆమె దగ్గరికి వస్తోంది తిరుపతి దేవతలు కాపురమున్న వూరు. ఈ దివ్య మంగళ విగ్రహం ఏ దేవాలయం నుంచీ యిలా వెలుపలికి వచ్చి ఉంటుంది ?

"మరచిపోయారా మేష్టరుగారూ ! నేనే, శకుంతలను !"

శకుంతల ! ఎలా సంభవం ?

"మిమ్మల్ని తలుచుకోని రోజు లేదంటే నమ్మండి మేష్టరుగారూ ! దూరప్రాంతంలో ఉండిపోయాం. మీ అడ్రసు తెలిసిందిగాదు. మావారితో ఎన్నోసార్లు చెప్పాను. ఈ ప్రాంతం వచ్చినప్పుడు మిమ్మల్ని తప్పకుండా కలుసుకోవా లనుకున్నాం. అబద్ధ మనుకుంటున్నారేమో ? అదిగో, ఆయనా వచ్చేశారు ...... ఏమండీ ! వీరే మేష్టరుగారు ......"

ఆమె శకుంత లవునా కాదా అన్న నా మీమాంస యింకా ఒక కొలిక్కి రానేలేదు. ఆమె నన్ను భర్తగారికి పరిచయం చేస్తోంది.

ఐనా మసకచీకటిలోనుంచీ కనిపిస్తున్న పరిసర ప్రకృతిలా కొద్దిగా మార్పులు వచ్చిన ఆకృతితో ఎట్టఎదుట శకుంతల ప్రత్యక్ష మవుతుంటే— ఆమె శకుంతల కాదని మాత్రం నే నెలా అనుకోగలను ? నా కళ్ళే నన్ను మోసగించకపోతే ఈమె శకుంతల వినా మరొకరు గాదు. నా చెవులే నన్ను వంచించడానికి పూనుకోనట్టయితే ఈ కంఠస్వరం శకుంతలది తప్ప మరొకరిది కాదు.

"అలాగా శకుంతలా ! వీరేనా మేష్టరుగారు !" నమస్కరిస్తూ సమీపించి అతడు నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు—"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకండీ మేష్టరుగారూ ! మిమ్మల్ని చూడాలని యిప్పటికి పదేళ్ళనుంచీ అనుకుంటున్నాం. ఈనాటికి సాధ్యమైంది. వేంకటేశ్వరుడి దర్శనం కోసం మా యాత్ర. యాత్రానందం మీతోనే ప్రారంభమైంది. రండి, రండి. సత్రంలో బసచేశాక తీరిగ్గా మాట్లాడుకుందాం ....."

అంతవరకూ శకుంతల భర్తసమేతంగా వుందని మాత్రమే అనుకున్నాను. నాలు గడుగులు ముందుకు వేశాక తెలిసింది. ఆమెను వెన్నంటి యిద్దరు ఆడపిల్లలున్నారు మగపిల్లవాడు చీర చెరగు పట్టుకుని ఆమె వెంట నడుస్తున్నాడు.

దారిలో చెప్పింది మా ఆవిడ తాను పెట్టెలో ఎక్కేసరికి శకుంతల నిద్రపోతోందట. లేచి కూర్చోగానే ఏవూరికి వెళ్తున్నారండీ అని అడిగిందట. ఆ మాటతో సంభాషణ ప్రారంభమైంది. రెండు రోజులకు మునుపు ఎక్కడో ఉత్తరదేశంలో రైలెక్కారన్నీ, వాళ్ళాయన అక్కడ కేంద్ర ప్రభుత్వంలో

ఉద్యోగం చేస్తున్నారనీ చెప్పిందట శకుంతల అందుకు వినిమయంగా వహ ఆవిడ గూడా స్వవిషయాలను వెల్లడించుకోవలసి వచ్చింది

"హైస్కూలు హెడ్మాష్టరుగా పనిచేసి రిటయి రయ్యారని చెప్పానో లేదో, ఆమె కప్పుడే అనుమానం కలిగింది అకాడికీ మీరు పనిచేసిన వూర్లన్నీ ఏకరువు పెట్టాను మీపేరు తెలుసుకునేదాకా ఒంటి కాలుపైన నిలిచింది అప్పటినుంచీ ఆవిడ ఆనందం చెప్ప శక్యంకాదు "

సత్రంలో ప్రక్క ప్రక్కనే గదులు దొరికాయి శకుంతల భర్తపేరు సచ్చిదానందం పేరుకు తగ్గట్టుగా ఆతడు నిండుగా స్వచ్ఛంగా నవ్వగలడు స్నానపానాదులు పూర్తి కాగానే అతడు సకుటుంబంగా మా గదిలోకి వచ్చేశాడు. "ఇక చెప్పండి మేష్టరుగారూ! పాలికేళ్ళ విశేషం శాలన్నింటినీ యిప్పుడు చెప్పెయ్యాలి మీరు" అంది శకుంతల.

"మొదట మీరు!" అన్నాను.

"అవును మరి! నువ్వే చెప్పాలి శకుంతలా!" అంటూ నన్ను బలపరిచాడు సచ్చిదానందం.

"నేను బి ఏ. ప్యాసయ్యాను మేష్టరుగారూ!" తప్పు చేసినట్టు సిగ్గుపడుతూ అంది శకుంతల

"ఆ తరువాత గూడా ఉద్యోగం వెలగబెట్టిన సంగతి చెప్పవే నువ్వు! ఐనా ఎంతకాలంలెండి మేష్టరుగారూ! ఎంచినట్టు నాలుగేళ్ళు అంతలో నాకూ ఉద్యోగంలో మార్పు వచ్చింది. పైగా బిడ్డలైపోయారు అన్నట్టు మొదట బిడ్డ పాపల సంగతి కాకుండా నీ బి ఏ. డిగ్రీని గురించి చెప్పుకుంటావేం శకుంతలా ?" సచ్చిదానందం నవ్వసాగాడు

"ఈ అమ్మాయిని చూశారా మేష్టరుగారూ! దీనిపేరు రాజ్యం ఇదేమో శారద. వీడు భాస్కరం. పెద్దమ్మాయికి పెళ్ళయింది. అల్లుడు ఎల్ ఐ. సి. లో పనిచేస్తున్నాడు. ఈ సంవత్సరం రాజ్యానికి పెళ్లి కావాలి . ."

"మరి మీ చెల్లెళ్ళు, తమ్ముడు " శకుంతలకు అడ్డు తగిలాను.

"అబ్బో అబ్బో, ఆ విషయా లడక్కండి మేష్టరుగార్లూ! ఆవిడకు తనవైపువాళ్ళంటే విపరీతమైన అభిమానం ఆ వివరాలు చెప్ప బూనుకుంటే మనకు బస్సులు, రైళ్ళు అన్నీ తప్పిపోతాయి . . ." అన్నాడు సచ్చిదానందం.

"అయితే మీరే చెప్పండి" అంటూ ముఖం చిన్నబుచ్చుకుంది. శకుంతల.

"ఏం, చెప్పలేనేమిటి! ఈవిడగారి తమ్ముడేమో గగనవీధులలో విహరిస్తుంటాడండీ మేష్టరుగారూ! అంటే కవికుమారు డనుకునేరు! ఏర్ ఫోర్సులో ఉద్యోగ మన్నమాట! పెద్ద చెల్లెలి నివాసం హైదరాబాదు. మరిదిగారక్కడ లెక్చరరు. చిన్నచెల్లెలి భర్తకు ఉద్యోగం లేదు. కడపజిల్లాలో బావులూ, భూములూ ఉన్నాయి . అతగాడి తమలపాకుల తోటలను గురించి చెప్పమంటావా శకుంతలా!"

"ఈయనగా రింతేనండీ మేష్టరుగారూ! ఎప్పుడూ పేళాకోళమే!" శకుంతల గూడా నవ్వసాగింది.

రేడియోలో వినిపిస్తున్నది శ్రావ్యమైన సంగీతమే గావచ్చు కానీ వాతావరణంలో అలజడి ఉన్నప్పుడు అది సరిగ్గా వినిపించదు. గదిలో నిండి నిబిడీకృతమై పోతున్న ఆనందానికి వెనుక నా అంతరంగంలో రామ్మూర్తి కల్పించి చెప్పిన కథ లీలగా మొరసిపోతోంది. పాపం, రామ్మూర్తి అంతకన్నా మరేం చేయగలడు ? నిజ జీవితంలో శకుంతలకు సుఖ సంతోషాలు లభ్య మౌతున్నాయంటే, రామ్మూర్తికి అంతకన్నా విచారకరమైన విషయం వేరొకటి ఉండదు. ప్రతీకార చర్యగా తన మానసిక ప్రపంచంలో ఆమెను ఎనలేని కష్టనష్టాలకు గురిచేసి, ఆ రీలిగా సంతృప్తి చెందడం అతడి ప్రస్తుతి వ్యాసంగాలో, ఒకట్టైతే కావచ్చు!

"కాసేపు విశ్రమించండి మేష్టరుగారూ! కొండపైకి బస్సెప్పుడు దొరుకుతుందో కనుక్కుంటాను" అంటున్నాడు సచ్చిదానందం.

